## క్లుప్తంగా

### ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజు



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన ఉప్పు రాజును బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి ప్రకటించారు. పార్టీ బలోపేతానికి రాజు చేసిన కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించి జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డికి రాజు కృతజ్ఞతలు తెలిపారు.

**కాజీపేటలో..**

కాజీపేట: బీజేపీ ఓబీసీ మోర్చా హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాజీపేట 62వ డివిజన్ సోమిడికి చెందిన పెసరు తిలక్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని కాజీపేటలో ఆదివారం అందజేశారు

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మసాగర్ : మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దపెండ్యాల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా పెద్దపెండ్యాల, కరుణాపురం, చిల్పూరు, నష్కల్ గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు.

### జంగాను కలిసిన కడియం శ్రీహరి, కావ్య

మడికొండ: తెలంగాణ స్టేట్ సీడ్స్, డీయిల్ గ్రోమోర్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని టేకులగూడెంలోని ఆయన స్వగృహంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కడియం కావ్యను గెలుపునకు సహకరించాలని జంగాను కోరారు. కార్యక్రమంలో నాయకులు కాజీపేట మండల అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కొప్పుల నవీన్ యాదవ్, విజయ్‌కుమార్, సదానందం, బైరి లింగమూర్తి, కుర్లమోహన్, పల్లపు అర్జున్, శ్రీకాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు రుమటాలజీ వైద్య శిబిరం

హన్మకొండ చౌరస్తా: ఈనెల 23వ తేదీన హనుమకొండ కాకాజీకాలనీలోని శ్రీఏషియన్ రుమటాలజీ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మధుకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ రుమటాలజిస్ట్ డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించనున్న వైద్య శిబిరంలో రూ.2వేల విలువైన ఎముకల పటుత్వ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. మోకాళ్లు, కీళ్లు, నడుము, మెడ తదితర నొప్పులతో బాధపడేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత వైద్య పరీక్షల కోసం 78935 88057 నంబర్‌కు ఫోన్‌చేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

### గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

కాజీపేట: నగర గంగపుత్ర (బెస్త) సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు కాజీపేటలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా దామెర వెంకటస్వామి, ప్రధానకార్యదర్శిగా వెంపటి సురేష్, కార్యదర్శిగా పాక భాస్కర్, కోశాధికారిగా జి.రవీందర్, సలహాదారులుగా ఎం.చందర్‌రావు, గోపు సంజీవ్‌తో పాటు ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

### 'శరపంజరం'ను ఆదరించాలి

కాజీపేట: శరపంజరం సినిమాను ప్రేక్షకులు ఆదరించి యూనిట్ సభ్యుల కృషిని ప్రోత్సహించాలని నిర్మాత, సంగీత దర్శకుడు మల్లిక్ ఎంవీకే కోరారు. కాజీపేట పట్టణంలోని భవాని థియేటర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి చిత్రాన్ని ఆదివారం తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నటీనటులతో ప్రత్యేక కథ అంశంతో నిర్మించిన సినిమాను ప్రేక్షకులు విధిగా చూసి ఆశీర్వదించాలని వేడుకున్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

కాశిబుగ్గ: కాశిబుగ్గకు చెందిన ఆడెపు రమ (55) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను ఆజంజాహి మిల్లు మాడిఫైడ్ వలంటరీ -2002 వర్కర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆజంజాహి మిల్లు స్థలంలోనే కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 14న ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో జరిగిన సభలో ఆమె పాల్గొన్నారని గుర్తుచేశారు. తన ఆకాంక్ష తీరకుండా రమ మృతి చెందడం బాధాకరమని వాపోయారు. ఆడెపు రమ కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు. రమ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో అసోసియేషన్ నాయకులు గుత్తికొండ రవి పాల్గొన్నారు.

# గుంతల రోడ్లతో గుబులు

- గతేడాది వర్షాలకు దెబ్బతిన్న రహదారులు, రోడ్లు
- ఏడాది సమీపిస్తున్నా స్పందించని ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ అధికారులు
- పరకాలకు వెళ్లాలంటే జంకుతున్న జనం



పరకాల-కనిపర్తి (చలివాగు) రహదారిపై గుంతలు, గోతులు

పరకాల : పరకాల వైపునకు వెళ్లాలంటే జనం జంకుతున్నారు. మలుపులతో పాటు గుంతలమయంగా మారిన రహదారులు, రోడ్లతో ప్రమాదాలు జరుగుతూ అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మండలంలోని పలు గ్రామాల రోడ్లతో పాటు హైవే రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. రోడ్లు ధ్వంసమై ఏడాది సమీపిస్తున్నా ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ అధికారులు నిద్రమత్తు వీడటం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**అదుపుతప్పితే అంతే..**

మండలంలోని వివిధ గ్రామాల రోడ్లు భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. రోడ్లన్నీ గుంతలతోపాటు పెద్దపెద్ద గోతులుగా మారాయి. రాత్రి వేళల్లో ప్రయాణిస్తే ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**డేంజర్‌గా మారిన ఎన్‌హెచ్ 353**

రోడ్డు ప్రమాదాలకు పరకాల పట్టణంలోని 353 జాతీయ రహదారి నిలయంగా మారింది. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టానురీతిగా వ్యవహరించడంతో రెండు కిలో మీటర్ల మేర రోడ్డు గుంతలమయంగా మారింది. హనుమకొండకు వెళ్లే రోడ్డులో వ్యవసాయ మార్కెట్ సమీపంలో మూడేళ్ల క్రితం ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఇదే రోడ్డు నుంచి వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు గుంతలను పూడ్చారు. కానీ భారీ వాహనాల రాకపోకల కారణంగా మళ్లీ గుంతలుగా మారాయి.



గుంతలుగా పరకాల ఎన్‌హెచ్ 353 రహదారి

### వారంలో మూడు, నాలుగు ప్రమాదాలు



ప్రధానరోడ్డు పక్కన మా దుకాణం ఉంది. కొత్తగా రోడ్డు వేసిన కొన్ని రోజులకు వర్షం నీళ్లు నిలిచిపోయి భారీ వాహనాల రాకపోకల కారణంగా దెబ్బతింది. అప్పటి నుంచి రోడ్డంతా గుంతలమయంగా మారి ప్రమాదాలకు దారితీస్తుంది. వారంలో మూడు, నాలుగు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అదుపుతప్పి పడిపోతే ఒక్కో సమయంలో నేనే పరుగెత్తి వారిని కాపాడుతున్నాను. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డును బాగుచేయాలి.

- చంద్రకళ, పరకాల

# రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ మామిడి అశోక్, పత్తిపాక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఒంటేరు వనమ్మవీరస్వామి, మాజీ ఉపసర్పంచ్ అజ్మీరా జోయి, వాంకుడోతు సుధీర్, బాబు, చంద్రమౌళి, బాబుసింగ్, చరణ్, తిరుపతి, మొగిలి, చేరాలు, కిషన్, శంకర్, చిన్నరాజు, భాస్కర్, రాజేందర్, సమ్మక్క, యశోద, కొమురక్క, మంజుల, శంకర్, రాజు, రాజుకుమార్‌తో పాటు మరో 50మంది కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు సత్యనారాయణరావు కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, నాయకులు మారెపల్లి రవీందర్, ప్రకాశ్‌రెడ్డి, శంకర్, మహేందర్ రెడ్డి, జగన్, కుమారస్వామి పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

# ఓట్లు అడిగే హక్కు బీజేపీకే ఉంది

- రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామ్‌గోపాల్‌రెడ్డి

ఎల్కతుర్తి : అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలోని ప్రతీ అంశాన్ని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తుందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు బీజేపీకే ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమటిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాజ్యాంగాన్ని మారుస్తామన్న హెగ్డే పైన చర్యలు తీసుకుని బీ ఫాం ఇవ్వకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకున్న విషయం దేశం మొత్తం తెలుసున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేయడం ఖాయమన్నారు.



మాట్లాడుతున్న కొమటిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి

# ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలి

- జేఏసీ మండల చైర్మన్ డ్యాగల సారయ్య

ఎల్కతుర్తి : భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని జేఏసీ మండల చైర్మన్ డ్యాగల సారయ్య పిలుపునిచ్చారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి భారత రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు దేశ ప్రజలు పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమయ్యిందన్నారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీకి ఓట్లతో ఓడించి బుద్ధి చెప్పాలని కోరారు. సీబీఐ, ఈడీ, ఐటీ, ఈసీ డిపార్ట్‌మెంట్లను బీజేపీ రాజకీయంగా ఉపయోగించుకుని స్వార్థ ప్రయోజనాలు పొందుతుందని ఆరోపించారు. బీజేపీ విధానాలను దేశంలోని ప్రజాస్వామ్య వాదులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ వీరన్న, చెప్యాల ప్రకాశ్, తిరుపతి, సీనియర్ నాయకులు రాజు, సుధాకర్, రవీందర్, అశోక్‌ముఖర్జీ, రామచంద్రం, ఫ్రాన్సిస్, జ్యోతి, ఆశీర్వాదం, అశోక్, కొంరయ్య, స్వామి, రమేష్, సారయ్య, కార్తీక్, మోహన్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

# ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన ప్రజలు

హన్మకొండ చౌరస్తా: రెండు నెలలుగా తాగునీటి సరఫరా సక్రమంగా అందడం లేదంటూ, నీటి సమస్యపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు అనేక పర్యాయాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని 8వ డివిజన్ కార్పొరేటర్ బైరి లక్ష్మీకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ ప్రజలతో కలిసి ఖాళీ బిందెలతో రోడ్డుపై ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజల సమక్షంలో మున్సిపల్ అధికారులకు ఫోన్ చేయగా 'ఈరోజు ఆదివారం మాకు సెలవు' అంటూ సమాధానం చెప్పారని అన్నారు. వేసవిలో నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతుంటే అధికారులు మాత్రం సెలవులు తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రజలు చెల్లించే పన్నులతో జీతాలు తీసుకుంటూ, ప్రజల కోసం పని చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రావణ్‌కుమార్, స్థానికులు స్వరూపరాణి, మల్లికాంబ, సునీత, రజిత, శ్రీదేవి, శ్యామల, పుష్ప, హస్సేనీబీ, రాజ్‌కుమార్, విజయ్, మొగిళి, యుగెందర్, రాజు, మధుకర్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజలు

# కూరగాయల సాగు..లాభాలు బాగు

- ఆదాయం పొందుతున్న రైతులు
- స్వయంగా మార్కెటింగ్ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న వల్బాపూర్ గ్రామస్తులు
- ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని వేడుకోలు

ఎల్కతుర్తి : తమకున్న వ్యవసాయ భూమిలో కూరగాయలను సాగుచేస్తూ అధిక దిగుబడులు, లాభాలు ఆర్జిస్తున్నారు మండలంలోని వల్బాపూర్ రైతులు. దీంతో కూరగాయల సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది ఆ గ్రామం. కోతిమీర, మెంతికూర, తోటకూర, పాలకూర, పచ్చిమిర్చి, వంకాయ, బెండకాయ, సోరకాయ, చిక్కుడుకాయ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, కాకరకాయ, క్యారెట్, బీట్‌రూట్‌తో పాటు ఇతర కూరగాయలను సాగుచేసి స్వయంగా హోల్‌సేల్, రిటేల్‌గా విక్రయించి అధిక లాభాలను పొందుతున్నారు. వరంగల్, హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాలకు తరలించి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. నెలల తరబడి పండించిన పంటలకు ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారించారు. తక్కువ పెట్టుబడితో కూరగాయలను సాగుచేసి ఎక్కువ లాభాలు పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ ఉన్న కూరగాయాలకు తమ దగ్గర కొనుగోలు చేసే వ్యాపారులు మాత్రం తక్కువ ధర చెల్లిస్తున్నారని రైతులు వాపోతున్నారు. రైతులకు సరైనా గిట్టుబాటు ధర కల్పించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని, కూరగాయల సాగును ప్రోత్సహించాలని పలువురు రైతులు కోరుతున్నారు.



బెండతోటను పరిశీలిస్తున్న మహిళా రైతు



సాగుచేస్తున్న టమాట తోట



తోటలో నుంచి తెంపిన టమాట

### లాభాలు బాగున్నాయి



నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో టమాట సాగు చేశాను. దాదాపు నెల నుంచి నెల పదిహేను రోజుల వరకు పంట చేతికి వస్తుంది. మార్కెట్‌లో పెట్టి పరంగా ధర కట్టిస్తారు. పంట సాగు మొదటి నుంచి పూర్తి అయ్యే వరకు సుమారు 1500 బాక్స్‌ల వరకు పండుతుంది. ఒక్కో పెట్టెలో 25కేజీల టమాటను ఫిల్ చేయవచ్చు. ఒక్క బాక్స్‌కు రూ.150 నుంచి 200 ధర కట్టిస్తారు. కాత పూర్తయ్యే వరకు రవాణా ఖర్చులు, కూలీల ఖర్చులు పోను సుమారు రూ.2లక్షల వరకు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం కాత చివరి దశకు చేరింది. వారానికి ఒకసారి టమాట తెంపి మార్కెట్‌కు తరలిస్తున్నాం. మార్కెట్ రేట్ కంటే తక్కువకు మా నుంచి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

- పోనుగంటి లక్ష్మణ్‌రావు, రైతు వల్బాపూర్

# సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయండి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి విజయమే లక్ష్యంగా సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేసి ప్రజలకు చేరువ కావాలని పార్టీ శ్రేణులకు హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో వరంగల్ పార్లమెంట్ స్థాయి సోషల్ మీడియా సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి కావ్య మాట్లాడుతూ ఏఐసీసీ ప్రకటించిన 5న్యాయ సూత్రాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం జెండా ఊపి పార్టీ ప్రచార రథాలను ప్రారంభించారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, డీసీసీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి నవీన్, నేహాల్, దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

**సీఎం సభను విజయవంతం చేయాలి**

హన్మకొండ చౌరస్తా: ఈనెల 24వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనబోయే జనజాతర సభను కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్, విజయశ్రీరజాలీ, నాయకులు రవళి, ప్రభాకర్‌రెడ్డి, అజీజ్‌ఖాన్, డాక్టర్ అనిల్, సరళ, విక్రమ్ పాల్గొన్నారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాడుకుంటా



కాజీపేట అర్బన్: మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

కాజీపేట అర్బన్: పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలోని పద్మశాలి భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, కోడం సంపత్, జానకీరాములు, సదానందం, వెంకటేష్, గండ్రకోట రాకేష్, ఫాతిమాచారి తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ 46వ డివిజన్ కమిటీ ఎంపిక**

మడికొండ: బీజేపీ 46వ డివిజన్ మడికొండ బూత్ కమిటీని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆదివారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా తూర్పాటి అబ్బ సాయిలు, ఉపాధ్యక్షుడిగా గంగారపు వీరేష్, ప్రధాన కార్యదర్శిగా నర్మెట భిక్షపతి, అధికార ప్రతినిధిగా గడ్డం అయిలయ్య, సంయుక్త కార్యదర్శిగా గోపనబోయిన రాజు, పార్టీ ముఖ్య సలహాదారులుగా కాశేశ్వరపు రాజేందర్, పైడిపాల రవీందర్, బూత్ కన్వీనర్లుగా గాండ్ల భిక్షపతి, రాసమల్ల వెంకటస్వామి, బుర్ర రమేష్, పసుల కార్తీక్, మిర్యాల రమేష్, బరిగల కృష్ణమూర్తి, నర్ర రమేష్, వస్కుల దేవేందర్‌ను ఎంపిక చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తామని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లామని అన్నారు.

### మద్యం స్వాధీనం

ఆత్మకూరు : అక్రమ మద్యం దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై రాకేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎం.డీ అంజాత్‌పాషా, బండి సాంబయ్య బెల్ట్‌షాపు నడుపుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఇద్దరి నుంచి రూ.17,310 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

శాయంపేట : గట్లకానిపర్తిలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం, శరత్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ బత్తిని సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శస్త్ర చికిత్స అవసరం ఉన్న వారికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్‌కార్డు వెంటతీసుకురావాలని సూచించారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు

- మాజీ మంత్రి దయాకర్‌రావు

ఐనవోలు : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే గెలుపని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో కలిసి హాజరై మాట్లాడారు. నేడు వరంగల్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా సుధీర్‌కుమార్ నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీజేపీ అగ్ర నాయకత్వం కాంగ్రెస్‌ను అధికారంలో ఉండనీయదని, ఆరు నెలల్లో ప్రభుత్వం కూలిపోతుందని అన్నారు. నాలుగుసార్లు ఓడిపోయిన కడియం శ్రీహరికి రాజకీయ జీవితాన్నిచ్చిన నన్ను విమర్శిస్తున్నాడని తీవ్రంగా మండిపడ్డారు. అరూరి రమేశ్ వ్యక్తిగత ప్రవర్తనతోనే ఎమ్మెల్యేగా ఓడిపోయాడన్నారు. అలాంటి వ్యక్తి ఎంపీగా గెలిచే అవకాశమే లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన మారెపల్లి సుధీర్ కుమార్‌ను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీని వీడిన మార్నేని రవీందర్‌రావును ఎట్టిపరిస్థితుల్లో పార్టీలోకి తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. వరంగల్ పార్లమెంట్ స్థానంలో తనను గెలిపించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. నాయకులు వాసుదేవరెడ్డి, నాగేశ్వర్‌రావు, ఉస్మాన్ అలీ, మోహన్, చందర్ రావు, గుంశావలీ, రజిని కుమార్, సురేష్, సదానందం, స్వామి, సోమేశ్వర్‌రావు, గోపాల్‌రావు, రాజు, రాఘవులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దయాకర్‌రావు

### పెరకవాడలో వీధికుక్కల స్వైర విహారం



ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ పెరకవాడలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్నాయి. దాంతో చేతిలో కర్రలేనిది ఇంటిలో నుంచి బయటికి వచ్చే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు. వాహనదారులు, బాటసారులపై పగలు, రాత్రి అనే తేడా లేకుండా దాడులకు తెగబడుతున్నాయని చెబుతున్నారు. బల్దియా అధికారులు స్పందించి వీధికుక్కల బెడదను అరికట్టాలని బీజేపీ నేత ముత్తినేని శ్రీనివాస్ కోరారు.